
కథ

# లవ్ మి లావణ్యా!

భీమరాజు వెంకటరమణ

వైజాగ్‌లోని ఓ డిగ్రీ కళాశాలకు సంబంధించిన విద్యార్థినులతో విహారయాత్రకు బయలుదేరిన బస్సు రాజమండ్రి దిశగా పరుగులెడుతోంది. విద్యార్థినులు రెండు వర్గాలుగా విడిపోయి అంత్యాక్షరీ మొదలుపెట్టారు. తెలుగు, హిందీ సినిమా పాటలతో బస్సు మారుమోగిపోతోంది. ఎప్పుడూ చదువు, క్రమశిక్షణ అని కఠినంగా వ్యవహరించే ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మేడమ్ ఆరోజు విద్యార్థినులతో కలిసి స్నేహంగా ఉండటం వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తున్నది. బయట చల్లటి వాతావరణం, బస్సులో కోలాహలం. ఇవేమీ పట్టనట్లు కిటికీ పక్కన కూర్చొని స్తబ్దుగా బయటకు చూస్తున్న లావణ్యపై విజయలక్ష్మి దృష్టిపడింది.



చిన్నగా వచ్చి లావణ్య పక్కన కూర్చుంది విజయలక్ష్మి. లావణ్య కాస్త కంగారుగా చూసి మొక్కుబడిగా నవ్వింది. అమ్మాయిలందరూ వాళ్ళ ఎంజాయిమెంట్‌లో వాళ్ళున్నారు. "ఏమిటి లావణ్యా! అందరూ హుషారుగా ఉంటే నువ్వేంటి మూడీగా ఉన్నావు? ఎనీ ప్రాబ్లం?" అడిగింది.

"అదేం లేదు మేడమ్ నేను బాగానే వున్నాను" అని అన్నదేగానీ లోపల కాస్త కంగారుపడుతూ ఉన్నది లావణ్య. "ఏమీ లేకపోవడమేమిటి? ఖచ్చితంగా ఏదో ఉంది! లేకపోతే లావణ్యేంటి ఇలా కూర్చోవడమేమిటి? కొంపదీసి ప్రేమలో పడ్డావా?" అడిగింది చిరునవ్వు చిందిస్తూ. ఆమాట వినగానే నెత్తిన పిడుగుపడ్డట్లు చూసింది లావణ్య. "మేడమ్" అని మాత్రం అనగల్గింది, ఇక నోట మాట రాలేదు.

"రిలాక్స్ లావణ్యా! భయపడకు. ఇలాంటప్పుడు హుషారుగా ఉండాల్సిన అమ్మాయి శూన్యంలోకి చూస్తూ ఉన్నదంటే ఎక్కడో మనసు పారేసుకుని ఉంటుంది అనే అనుమానం తప్పక వస్తుంది. సరే, విషయమేమిటంటే క్లుప్తంగా చెప్పు. నేనేమైనా సహాయపడగలనేమో చూస్తాను" అన్నది విజయలక్ష్మి లావణ్య చేతిపై తన చెయ్యి వేస్తూ.

లావణ్యకు కాస్త ధైర్యం వచ్చినట్లయింది. "మరేంలేదు మేడమ్, మా వీధిలో ఉండే చైతన్య అనే అబ్బాయి ఈమధ్యే పరిచయం అయ్యాడు. అతను ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మా పరిచయం స్నేహంగా మారింది, సెల్‌ఫోన్‌లో రోజుకి ఒకసారైనా మాట్లాడుకుంటాము. కానీ నిన్న ఫోన్ చేసి తను నన్ను ప్రేమిస్తున్నానని, నా అభిప్రాయం రేపు ఉదయంలోగా చెప్పమని అడిగి, "నువ్వు సరే అంటావనే నా ఆశ" అంటూ ఫోన్ కట్ చేసాడు, కానీ మేడమ్! నేను అతన్ని మంచి స్నేహితుడుగా భావిస్తున్నాను, సడన్‌గా అలా అడిగేసరికి నాకేమి చెప్పాలో అర్థం కావడంలేదు" అన్నది దిగులుగా ముఖంపెట్టి. విజయలక్ష్మి దీర్ఘంగా నిట్టూర్చింది. ఆమె అప్పుడు ఏమీ మాట్లాడదలుచుకోలేదు. కాస్త ఏకాంతం దొరికినప్పుడు మాట్లాడుదామనే ఉద్దేశంతో విని ఊరుకుంది.

అన్నవరం చూసుకొని సాయంత్రం అయ్యేసరికి బస్సు రాజమండ్రీ చేరింది. గోదావరి వద్దున్న ఉన్న హోటల్ మహాలక్ష్మిలో బస ఏర్పాటు అయింది. స్నానాదులు కానిచ్చి రాత్రి భోజనాలు కూడా ముగిసాక అందరూ హోటల్ టెర్రస్‌పైన చేరారు. చల్లగా హాయిగొలిపే గాలి, వెన్నెల్లో వన్నెలొలుకుతూ గోదావరి, అందరూ కాసేపు మంత్రముగ్ధులయ్యారు.

వాతావరణం అనుకూలంగా ఉన్నదని గ్రహించిన విజయలక్ష్మి "అమ్మాయిలూ, సరదాగా కాలక్షేపానికి ఏదైనా చెయ్యండి" అన్నది. అంత్యాక్షరీలు, ఆటలు పాటలతో అలసిపోయి ఉండటంవల్ల ఇప్పుడు ఏమిచెయ్యాలా అని ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారు. అది గమనించిన విజయలక్ష్మి "ఒకే, ఈసారి ఏమిచెయ్యాలో నేను చెబుతాను. ఏదో ఒక టాపిక్ తీసుకుందాం. దానిపై ఒక్కొక్కరూ వారివారి అభిప్రాయాలు క్లుప్తంగా చెప్పాలి. సరేనా" అడిగింది.

"ఒకే మేడమ్. అయితే ఫిజిక్స్‌లో మాత్రం దయచేసి అడగకండి" అన్నది ఒక అమ్మాయి. అందరూ నవ్వారు.

"ఇంతటి ఆహ్లాదమైన వాతావరణంలో ఫిజిక్స్, మ్యాథ్స్ అడిగితే బావుండదని నాకూ తెలుసు. నేనడిగే టాపిక్ ప్రస్తుతానికి అందరికీ అవసరమైనది, అవగాహన కావలసింది. ఏమంటారు?" అన్నది అందరి వైపూ చూస్తూ.

"వుయ్ ఆర్ రెడీ మాడమ్" అన్నారు అందరూ ఒక్కసారిగా.

ఆమె చెప్పబోయే టాపిక్ కోసం ఆతృతగా చూస్తున్నారు. "ద టాపిక్ ఈజ్... ఈజ్.. లవ్" అన్నది విజయలక్ష్మి నిదానంగా.

అందరూ ఒక్కసారిగా నివ్వెరపోయారు. ఒకరి ముఖం మరొకరు చూసుకుంటున్నారు. కంగారుపడుతున్నారు. లావణ్య విజయలక్ష్మి వైపు ఆశ్చర్యంగా చూస్తోంది. "అమ్మాయిలూ, మీరు మరీ అంత బెంబేలెత్తిపోకండి. ఏమీ తెలియదన్నట్లు నటించకండి. ఫీల్ ఫ్రీ టు ఎక్స్‌ప్రెస్, ఈ టాపిక్ ప్రస్తుతం అన్ని సబ్జెక్టులకంటే ముఖ్యమైంది. దెన్ స్టార్ట్ వన్ బై వన్" అన్నది వాళ్ళకి హుషారు కలుగజేస్తూ.

విజయలక్ష్మి మాటలతో ధైర్యం తెచ్చుకున్న అమ్మాయిలు ఒక్కొక్కరుగా చెప్పడం మొదలుపెట్టారు: ప్రేమంటే పవిత్రమైనదని, సముద్రంలా లోతైనదని, శిఖరంలా ఎత్తైనదని, రెండు హృదయాల కలయిక అని, ధైర్యం ఉన్నవారినే అది వరిస్తుందని,దురదృష్టవశాత్తూ పెద్దవాళ్ళకు అది అర్థంకాదని, ఇప్పుడు ఉన్నది ప్రేమకాదు ఆకర్షణ అని, సెక్స్ అని రకరకాలుగా అనర్గళంగా అలసిపోయేలా ఉపన్యాసం ఇచ్చారు.

అది విని విగ్రహంలా నీలుక్కుపోయిన విజయలక్ష్మి తేరుకొని "ఇందాక అంత కంగారుపడ్డారు? ఇప్పుడేమో ఒక్కొక్కళ్ళూ పోటీలుపడి స్పీచ్‌లు దంచిపారేశారు? మీముందు మా లెక్చెరర్‌లము నిలుస్తామా

అనిపిస్తోంది. ఎనీవే, అయాం వెరీ హ్యాపీ టు హియర్ యువర్ వాయిస్, ఇక మనం ప్రేమ గురించి నిర్వచనాలు చెప్పుకోవడం ఆపి కాలేజీ లైఫ్‌లో ఏర్పడే ప్రేమ విషయంలో అమ్మాయిలు ఎలా వ్యవహరిస్తే బావుంటుంది అనేది తెలుసుకోవడం ముఖ్యం. ఏమంటారు?" అడిగింది.

"యూ ఆర్ రైట్ మేడమ్" అన్నారు అందరూ ఒక్కసారిగా.

అంతలో అక్కడికి ఒక వ్యక్తి వచ్చి "విజయా! ఇక్కడ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? రేపు ఉదయం మీరు పాపికొండలుకి వెళ్ళడానికి టూరిజం డిపార్టుమెంట్ వారి బోట్ బుక్ చేసాను. ఉదయం ఏడు గంటలకల్లా అందరూ బయలుదేరాలి, సాయంత్రానికి తిరిగివచ్చేస్తారు" అన్నాడు.

"థ్యాంక్యూ వెరీమచ్! నీకు శ్రమ ఇచ్చాను" అంటున్న విజయలక్ష్మికి అతన్ని చూస్తున్నప్పుడు ఒక ఆలోచన వచ్చింది. అతనితో "ప్రస్తుతం మేము కాలేజీలో ప్రేమల గురించి మాట్లాడుకుంటున్నాం. నీ ప్రేమకథ మా స్టూడెంట్స్‌కి చెప్పనా?" అని అతన్ని అడిగింది.

"చెప్పుకో కావాలంటే! అయితే నేనిక్కడి నుండి పారిపోయాక" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడతను.

తను మేడమ్ క్లాస్‌మేట్ అయి ఉంటాడని అందరికీ అర్థమైంది. విజయలక్ష్మి చెప్పబోయే విషయాన్ని అందరూ శ్రద్ధగా వింటున్నారు. "తిరిగి తిరిగి విషయం నావైపే వచ్చిందే, సరే సరదాగా అప్పటి నా కాలేజీ లైఫ్ గురించి చెబుతా" అని మొదలుపెట్టింది.

నేను ఇంటర్ మా ఊర్లో చదివినా బీయస్సీ కావలి జవహర్ భారతిలో చదవాలని కోరికగా ఉండేది. మా నాన్న అందుకు ఒప్పుకొని ఆ ఊర్లో మా బాబాయి దగ్గర నన్నుంచి కాలేజీలో చేర్పించాడు. మొదటి రోజు కాలేజీకి వెళుతున్నప్పుడే మా బాబాయి నవ్వుతూ నాకొక హెచ్చరిక చేసాడు. "అమ్మా విజయా

**మధ్యాహ్నం అందరూ భోజనానికి ఇంటికి వెళతారు. మేము ముగ్గురం ఇల్లు దూరం కాబట్టి బాక్స్‌లు తెచ్చుకుంటాం. ఆనంద్‌ని రమ్మన్నట్లు పిలిచింది రాణి. వచ్చి కూర్చున్నాడు. అతన్నీ మాతో కలిసి భోజనం చెయ్యమన్నది. ముగ్గురి బాక్స్‌ల్లో తెచ్చుకున్నది అతనితో షేర్ చేసుకొని తిన్నాం.**


జాగ్రత్త అసలే ఆ కాలేజీకి లవర్స్ కాలేజీ అని పేరు" అన్నాడు. "ప్రతి కాలేజీలో ప్రేమ వ్యవహారాలు ఉండవా? బాబాయి నాకు కాస్త జాగ్రత్త చెబుతున్నాడులే" అనుకొని నేనూ నవ్వుకుంటూ వెళ్ళిపోయాను.

వంద ఎకరాల భూమిలో విసిరేసినట్లు అక్కడక్కడ పెద్దపెద్ద భవనాలతో ఆ కాలేజీ ఒక యూనివర్సిటీకి దీటుగా ఉంటుంది. ఇక లెక్చరర్స్ విషయానికొస్తే మ్యాథ్స్ మాణిక్యరావుగారు, ఫిజిక్స్ మాధవరావుగారు, కెమిస్ట్రీ రామచంద్రారెడ్డిగారు, తెలుగు భుజంగరాయశర్మగారు అందరూ హేమాహేమీలే. ఇక ఇంగ్లీషు రత్నజోసఫ్‌రాయ్‌గారు ఒక ఒథెల్లో, ఒక టెంపెస్ట్ చెబితే ఎంత ఉత్కంఠభరితంగా ఉండేదో, మచ్ ఎడో ఎబౌట్ నథింగ్ చెబితే అంత సరదాగా ఉండేది. ప్రక్క క్లాసుల నుండి కూడా స్టూడెంట్స్ వచ్చి కూర్చునేవాళ్ళు. ఇక ఆయన రోమియో అండ్ జూలియట్ చెబితే? బుద్ధావతారాలు అని పిలవబడే వాళ్ళు కూడా ప్రేమలో పడతారేమో అనిపించేది? ప్రిన్సిపాల్ పట్టాభిరామిరెడ్డిగారి సారథ్యంలో కాలేజీ అద్భుతంగా నడిచేది.

రైల్వేస్టేషన్‌కి పడమరగా మా కాలేజీ, తూర్పున ఊరిచివర పాత ఊరులో నేనుండే మా బాబాయి వాళ్ళ ఇల్లు. మా వీధిలోనే వేణుగోపాల్ అనే అబ్బాయి, పక్కవీధిలో సుధారాణి అనే అమ్మాయి పరిచయం అయ్యారు. కలిసి చదువుకునేవాళ్ళం. ముగ్గురం కలిసి కాలేజీకి వెళ్ళేవాళ్ళం. వేణు మంచి తెలివైనవాడు. చాలా ప్రశాంతంగా ఉండేవాడు, అందరినీ చక్కగా పలకరిస్తాడు. రాముడు మంచి బాలుడు అన్నట్లు ఉండేవాడు. అతనికి వ్యతిరేకంగా ఉండేది రాణి. హడావిడి మనిషి. తనకు నచ్చని విషయం ముఖాన చెప్పేస్తుంది. ఎవరైనా కాస్త అతిగా మాట్లాడితే దులిపేస్తుంది. ముగ్గురం పోటీ పడి చదివేవాళ్ళం. క్లాసులో మా ముగ్గురిదే డామినేషన్. మొదటి సంవత్సరం అయిపోయేసరికి మేము మంచి స్నేహితులమయ్యాం. రెండవ సంవత్సరం మధ్యలో మొదలైయింది ఒక కథ.

ఆనంద్ అనే బీకాం చదివే అబ్బాయి రాణికి ఒక లెటర్ రాసి ఆమె కూర్చుండేచోట డెస్కులో పెట్టాడు. ఆ రోజు ఉదయం ఆ లెటర్ చూసిన రాణి మాకు చూపించింది. "రాణి, నువ్వంటే నాకు చాలా ఇష్టం. నిన్ను ప్రేమిస్తున్నాను. ఎదుటపడి అడిగితే నువ్వు కాదంటే నేను తట్టుకోలేను. ఎలా రియాక్ట్ అవుతానో తెలియదు. ఒకటి మాత్రం నిజం నువ్వు లేక నేను లేను. నాతో నువ్వు ఈమధ్య కొంచెం సన్నిహితంగా ఉన్నావు. దాన్నిబట్టి నువ్వూ నన్ను ఇష్టపడుతున్నావని అనుకుంటాను. నేనంటే నీకిష్టమైతే రేపు తెల్ల డ్రెస్ వేసుకొని రా. ఇంతకన్నా ఏమి వ్రాయాలో తెలియదు.... ఇట్లు ఆనంద్".

ఆనంద్ కాస్త పోకిరీ అబ్బాయని అందరికీ తెలుసు. యావరేజ్



స్టూడెంట్. కాలేజీ క్యాంపస్‌లో అప్పుడప్పుడూ సిగరెట్స్ తాగేవాడు. ప్రిన్సిపాల్‌గారు ఒకసారి వార్నింగ్ ఇచ్చారు కూడా. మా కాలేజీలో ప్రతి సంవత్సరం ఫాన్సీ డ్రెస్ కాంపిటేషన్ నిర్వహించేవారు. ఆ సంవత్సరం ఆనంద్ బిచ్చగాడి వేషం వేసి ఎవ్వరూ గుర్తుపట్టలేనంతగా నటించాడు. నిజమైన బిచ్చగాడు వచ్చి కాలేజీలో న్యూసెన్స్ చేస్తున్నాడని ప్రిన్సిపాల్‌గారు పోలీసులకు ఫోన్ కూడా చెయ్యబోయారు. అప్పుడు నిజం తెలుసుకొని అతనికి ఫస్ట్ ప్రైజ్ ఇచ్చారు.

ఆ సందర్భంలో రాణి అతన్ని ఎంతగానో మెచ్చుకుంది. అలా అతనితో పరిచయం అయింది. కానీ సడన్‌గా అతను ఇలా రాణిని ప్రపోజ్ చెయ్యటం మా అందరికీ ఆశ్చర్యం వేసింది. రాణి ఏమి చేస్తుందో మాకు అర్థం కాలేదు. అతన్ని నలుగురిలో నిలబెట్టి దులిపేస్తుందో, ప్రిన్సిపాల్‌కి కంప్లయింట్ ఇస్తుందో? అప్పుడు ఆనంద్ రాణితో ఎలా ప్రవర్తిస్తాడో?! ప్రశాంతంగా చదువు సాగిపోతుంటే మధ్యలో ఇదేమిటి? అని మాకు అనిపించింది.

తరువాత రోజు మమ్మల్ని ఆశ్చర్యపరుస్తూ రాణి తెల్ల డ్రెస్‌లో కాలేజీకి వచ్చింది. లంచ్‌టైమ్‌లో ప్రత్యక్షమయ్యాడు ఆనంద్. అతని ముఖంలో ఉక్కిరిబిక్కిరి ఆనందం. మధ్యాహ్నం అందరూ భోజనానికి ఇంటికి వెళతారు. మేము ముగ్గురం ఇల్లు దూరం కాబట్టి బాక్స్‌లు తెచ్చుకుంటాం. ఆనంద్‌ని రమ్మన్నట్లు పిలిచింది రాణి. వచ్చి కూర్చున్నాడు. అతన్నీ మాతో కలిసి భోజనం చెయ్యమన్నది. ముగ్గురి బాక్స్‌ల్లో తెచ్చుకున్నది అతనితో షేర్ చేసుకొని తిన్నాం. కాసేపాగి స్థిమితపడి అతను మాట్లాడటం మొదలుపెట్టాడు. "థ్యాంక్స్ రాణి, నువ్వొప్పుకుంటావనుకోలేదు. నాకు చాలా సంతోషంగా ఉంది. మనం కాస్త అవతలకు వెళ్ళి మాట్లాడుకుందామా?" అన్నాడు.

"ఫరవాలేదు. ఇక్కడే మాట్లాడుకుందాం. వీళ్ళకూ నాకూ మధ్య

ఏ దాపరికాలు లేవు" అన్నది రాణి.
అతను కాస్త తటపటాయించాడు.

కానీ రాణి మాట్లాడటం మొదలుపెట్టింది. "ఆనంద్- నాకున్న కొద్దిపాటి పరిచయంతో నువ్వు మంచివాడవనే అనుకుంటున్నాను. అందుకే ఈమధ్య నీతో కాస్త చనువుగా మాట్లాడుతున్నాను. ఇప్పుడు కూడా నీ ప్రపోజల్ త్రోసిపుచ్చలేక నువ్వడిగిన డ్రస్‌లో వచ్చాను. మనం మాట్లాడుకొని ఒక అవగాహనకు రావాలని నా ఉద్దేశం. అందుకోసం నా సంశయాలు కొన్ని నువ్వు తీర్చాలి. ఏమంటావ్?" అన్నది. అతను సరే అన్నట్లు తలూపి "ఏమిటి అడుగు చెబుతా" అన్నాడు ఉత్సాహంగా.

"ఇప్పుడు నేను నీ ప్రపోజల్‌కు సరే అన్నాననుకో ఏం చేస్తావ్?" అడిగింది.

"చెయ్యటానికేముంది? నా ప్రేమ ఫలించిందని సంతోషపడతా... నిన్ను పెళ్ళి చేసుకుంటా" అన్నాడు ఆవేశంగా.

"ఏది ఇప్పుడా? సెకండియర్ డిగ్రీలోనా?" అడిగింది సావధానంగా.

"అంటే నాఉద్దేశం" అంటూ ఏమిచెప్పాలో అర్థంకాక ఆగిపోయాడు.

"ఇప్పుడే పెళ్ళి చేసుకోవడానికి కూడా నేను సరే అన్నాననుకో, పెళ్ళిచేసుకొని భార్యాభర్తలుగా కలిసి కాలేజీకి వద్దామా? పిల్లల్ని కంటూ ఇంట్లో కూర్చుందామా? అఫ్‌కోర్స్ అది చూడ్డానికి బాగా లేకపోయినా సరే అనుకుందాం. కానీ నాకు తిండి భర్తగా నువ్వు సంపాదించి పెడితే బావుంటుందా? లేక నీతోపాటు నేను కూడా మీ నాన్న మీద ఆధారపడితే బావుంటుందా? కాస్త ఆలోచించి చెప్పు."

"నేనేమంత తెలివి తక్కువవాడిని కాదు రాణి. నువ్వడిగేది నాకర్థమయింది. చదువయ్యాక, నాకు ఉద్యోగం వచ్చాకే పెళ్ళి చేసుకుందాం" అన్నాడు కాస్త చిరునవ్వు చిందిస్తూ.

"గుడ్. నువ్వు తెలివిగలవాడివని నీతో ఎక్కువగా చర్చించవలసిన అవసరంలేదని నాకు తెలుసు. కానీ ఇక ఒకటిన్నర సంవత్సరం మనం ప్రేమించుకుంటూ, సినిమాలకి షికార్లకి తిరుగుతూ ఇప్పుడు చదువుతున్నట్లుగా చదవగలమా? నిజం చెప్పు అసలు నిన్న నాకు లెటర్ రాసినప్పటి నుండి నువ్వు పుస్తకం పట్టావా? ఖచ్చితంగా లేదనే నీకు తెలుసు. అలాగే రాత్రంతా నాకు ఏదోలా ఉంది. చదవాలనిపించలేదు. మనం ప్రేమికులుగా సినిమాలు, షికార్లు తిరుగుతూ మంచి మార్కులతో పాస్ కాగలమా?అలా అయిన వాళ్ళు ఎంతమంది ఉన్నారు?వాళ్ళతో కలిసి నువ్వు మాట్లాడావా?" నవ్వుతూనే అడిగింది.

"ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్నదేమిటి రాణీ" అడిగాడు సూటిగా.

నా ఉద్దేశంలో తెలివిగల స్టూడెంట్ అబ్బాయి అయినా అమ్మాయి అయినా ప్రేమ కారణంగా చదువులో వెనకబడి దానివల్ల జరిగిన నష్టాన్ని జీవితాంతం అనుభవించాలని అనుకోరు.ఎందుకంటే ప్రేమించినంతకాలం సాటి స్టూడెంట్స్ మధ్య ఏదో సాధించినట్లు గర్వంగా తిరిగినా పెద్దవాళ్ళ విషయంలో భయపడుతూ ఉండాలి. తప్పులు చెయ్యకుండా ఉండలేరు. దానివల్ల కలిగే చిక్కులు మరికొన్ని. వీటన్నిటికీ లోనుకాకుండా ఉండాలంటే ప్రపోజ్ చేసుకున్నా స్నేహంగా మాత్రమే ఉంటూ చదువు అయిందాకా ఆగటం ఒక్కటే మార్గం. ఆమాత్రం నిరీక్షణ లేకపోతే అది అసలు ప్రేమ అవుతుందా?" తనమీద తనకు నమ్మకం నియంత్రణ లేని వారు ఎవరైనాసరే ప్రేమకే కాదు దేనికీ అర్హులు కారు అని నా ఉద్దేశం" అన్నది అతని ముఖంలోకి చూస్తూ.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్?" అడిగాడు ఆనంద్.

"మన చదువు సజావుగా పూర్తయిందాకా మనం స్నేహంగానే ఉందాం. చదువులో అనుకున్నది సాధిద్దాం. మనకాళ్ళమీద మనం నిలబడదాం. అప్పుడు మనం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. ఈలోగా ఒకరి గురించి ఒకరికి అవగాహన ఏర్పడుతుంది. స్నేహం ప్రేమగా ఎటూ మారిపోతుంది. ఒకవేళ మన అభిప్రాయాల్లో మార్పు వచ్చినా మంచి స్నేహితుల్లా ఉండిపోతాం. అనుకున్నది జరగలేదని కాస్త మనసు బాధపడినా అది ఆత్మహత్యలు చేసుకొనేంత తీవ్రంగా ఉండదు. ఒకవేళ ఓర్పుగా మన ప్రేమ నిలబడిందా. అంతకన్నా



కావలసిందేముంది? తరువాత జీవితం స్వర్గంగా ఉండి తీరుతుంది" అన్నది కాస్త ఉద్వేగంగా.

కాసేపు ఆలోచించాక "ఒకే రాణీ. నీ ఇష్టం. నీ ఆలోచన నాకు నచ్చింది. నువ్వన్నట్లే నడుచుకుందాం! కానీ నా మనసు మారదు అని నాకు బాగా తెలుసు. ఎంత కాలమైనా నిరీక్షిస్తుంది. అని కొంచెం నవ్వి 'బాయ్', అంటూ వెళ్ళిపోయాడు ఆనంద్. నేను, వేణు ఊపిరి పీల్చుకున్నాం" అంటూ విజయలక్ష్మి చెప్పడం ఆపింది.

** ** **

ఇద్దరు బాయిస్ ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళారు. ఎవరికి కావలసినవి వారు తీసుకుంటున్నారు. లావణ్య విజయలక్ష్మి దగ్గరకు వచ్చి ఆమె చేతిలో ఒక కూల్‌డ్రింక్ పెట్టి పక్కన కూర్చొని

***రాణి ముఖం ఎర్రగా మారిపోయింది "ముఖ్యమైన క్లాసులున్నాయని వాళ్ళకు చెప్పలేవా? ఈ సమయంలో నీచేత కాలేజీ మాన్పించి బలాదూర్ తిప్పటానికి వాళ్ళకి ఎలా మనసొప్పింది?"***

"తరువాత ఏమైంది మేడమ్?" అని అడిగింది.

విజయలక్ష్మి నవ్వుతూ "తరువాత ఏమైందో రేపు చెప్పకూడదా?"అంది.

లావణ్యతోపాటు అందరూ "నో, ఇప్పుడే చెప్పాలి" అన్నారు.

"క్లాసులో పాఠాలు ఇంత శ్రద్ధగా వినరుకదా" అని నవ్వుతూ చెప్పడం మొదలుపెట్టింది.

"ఒకసారి ఫిజిక్స్‌లో స్పెషల్ క్లాసు పెట్టారు మాధవరావు సార్. జరిగిపోయిన క్లాసుల్లో తెలియనివి చెప్పడంతోపాటు సమయం తక్కువగా ఉన్నందున నాలుగైదు చాప్టర్లు చెప్పాలనే ఉద్దేశంతో. మళ్ళీ రిపీట్ చెయ్యటం కుదరదు కాబట్టి ఆ క్లాసులకి ఎవరూ మిస్ అవ్వద్దని రెండురోజుల ముందు నుండి చెప్పారాయన. కానీ ఎందుకనో అనుకోకుండా వేణు ఆ రెండు రోజులు కాలేజీకి రాలేదు. రెండురోజుల తరువాత వచ్చాడు. రాగానే అతని మీద విరుచుకు పడింది రాణి. "స్పెషల్ క్లాసులకెందుకు రాలేదు?" అన్నది సీరియస్‌గా ముఖం పెట్టి. ఆమె అలా అడగటం వేణుకు నాకూ కూడా ఆశ్చర్యం కలిగించింది అతను కాస్త తడబడుతూ అది.. అది.. మా బంధువు లొస్తేను మైపాడు బీచికి, నెల్లూరులో సినిమాకి, మా బంధువుల ఇళ్ళకు తీసుకెళ్ళాల్సి వచ్చింది" అన్నాడు.

రాణి ముఖం ఎర్రగా మారిపోయింది "ముఖ్యమైన క్లాసులున్నాయని వాళ్ళకు చెప్పలేవా? ఈ సమయంలో నీచేత కాలేజీ మాన్పించి బలాదూర్ తిప్పటానికి వాళ్ళకి ఎలా మనసొప్పింది? నువ్వేమైనా జమీందారుననుకుంటున్నావా? మీ నాన్నగారు పోయారు. అమ్మ కష్టపడి చదివిస్తున్నది, ఆమె మొహమాటపడితే నువ్వు సర్ది చెప్పుకోలేవా బంధువులకి? రోజుకి నాలుగు గంటల క్లాసు. ఎంత సబ్జెక్టు రివైజ్ అయిందో తెలుసా? ఎన్ని కొత్త చాప్టర్స్ చెప్పారో తెలుసా? రేపటి నుండి వేరే లెసెన్స్ చెబుతారు. ఎలా పికప్ చేస్తావ్? బుద్ధుందా నీకు?" అని అరిచేసింది. వేణుతోపాటు అందరం నివ్వెరపోయాం. "ఛ" అంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది. కాసేపాగి వేణు వెళ్ళి "ఎలాగైనా కష్టపడి పికప్ చేస్తాగా, నువ్వూ విజయా ఉన్నారుగా హెల్ప్ చెయ్యటానికి" అని చెప్పి రాణిని శాంతింపజేసాడు.

ఆరోజు రాత్రి నాకు నిద్రపట్టలేదు. "రాణి వేణు మీద అంతగా కోప్పడిందెందుకు? అతని విషయంలో మరీ అంత శ్రద్ధ ఎందుకు? ఒకవేళ రాణి వేణు అంటే ఇష్టపడుతున్నదా? అందుకే ఆనంద్ ప్రపోజల్‌కి బ్రేక్ వేసిందా? ఆమాట అనుకోగానే నాకెందుకో గుండెలో దిగులుగా అనిపించింది. ఎందుకంటే నేను అప్పటికే వేణుని ఇష్టపడుతున్నాను కాబట్టి. నేను కూడా ప్రేమ వల్ల చదువు చెడిపోకూడదనే నా మనసులో మాట అతనికి చెప్పలేదు.

(మిగతా 43వ పేజీలో)

# లవ్ మి లావణ్యా!

(17వ పేజీ తరువాయి)

కానీ నా ఆలస్యం నాకు నష్టాన్ని కలిగిస్తుందా? అలాగని ఇప్పుడేం చెయ్యాలి? రాత్రంతా ఆలోచించాను. రాణికి వేణు మీద అలాంటి ఉద్దేశం ఉంటే ఎప్పుడో ప్రపోజ్ చేసి ఉండేది. కాకపోతే ఆనంద్‌కి చెప్పినట్లే స్నేహంగా మాత్రమే ఉండాలని కండిషన్ పెట్టేది. ఆమాట అనుకోగానే నాకు కాస్త ఓదార్పు కలిగింది. హాయిగా నిద్రపోయాను! అది కథ! ఇక మనమూ నిద్రపోదామా?" అన్నది విజయలక్ష్మి.

అందరూ ఒక్కసారిగా లేచారు. "అదేంటి మేడమ్? ఆ తరువాత ఏమి జరిగిందో చెప్పకుండా ఎలా అయిపోతుంది?" అన్నాడు ముక్తకంఠంతో.

"ఏమి జరిగిందా! కాలేజీ చదువులు అయిపోయాయ్! నేనూ, వేణు పీజీ చేసాం, ఆనంద్ సీయే చేసాడు. రాణి గ్రూప్ వన్ రాసి సెలక్టయింది" అని మళ్ళీ ఆపేసింది.

"మేడమ్. అసలు విషం చెప్పండి ప్లీజ్" అని కేకలు పెట్టారు.

"ఓకే. కూల్ డౌన్, తరువాత ఏమి జరిగిందంటే నేనే వేణుకి పీజీలో ప్రపోజ్ చేసా. నా చదువు అయిపోయి ఉద్యోగం వచ్చేదాకా అతను నాకోసం నిరీక్షించాడు. తరువాత మేము పెళ్ళి చేసుకున్నాం. ఆనంద్ తన వ్యక్తిగత కారణాల వల్ల వేరే వెళ్ళి చేసుకున్నాడు. అతనూ రాణి మంచి స్నేహితులుగా మిగిలిపోయారు. ఇందాక ఇక్కడికి వచ్చిపోయి నతనే ఆనంద్. ఇక్కడ రాజమండ్రిలో పేరున్న ఆడిటర్. రాణి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక పెద్ద గవర్నమెంట్ ఆఫీసర్. తను ప్రేమ పెళ్ళి చేసుకోపోయినా తనకు తగిన నచ్చిన వ్యక్తిని ఏరికోరి చేసుకుంది. అతనూ ఇప్పుడు హైదరాబాద్‌లో ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీకి డైరెక్టర్. ఆమె ఆనంద్‌నిగానీ వేణునిగానీ ప్రేమించలేదు" అని చెప్పి అందరి వంక ఒకసారి చూసింది విజయలక్ష్మి. అమ్మాయిలందరి ముఖంలో కాస్త నిరుత్సాహం కనబడుతున్నది.

"అమ్మాయిలూ, దటీజ్ లైఫ్! ఇక్కడ మీరు డిసప్పాయింట్ అవ్వాల్సిందేమీలేదు. మేమందరం ప్రేమ అనే భావాన్ని సరిగా అర్థం చేసుకున్నాం కాబట్టి అందరం సంతోషంగా ఉన్నాం. ప్రేమించుకున్న వాళ్ళందరూ జీవితంలో ఒకటి కాలేకపోవచ్చు. కొందరు కావచ్చు. ప్రేమించామని అనుకున్న తర్వాత కాలపరీక్షకి అది నిలబడాలి. నిలబడకపోవడమూ తప్పుకాదు. ఎందుకంటే దాని కారణాలు దానికుంటాయి. అవి ప్రతి వ్యక్తికి వేరువేరుగా ఉంటాయి. అది ఓడిపోవడము కాదు, గెలవడమే. మనం జీవితంలో ప్రేమ పేరుతో కింద పడిపోకుండా నిలబడటం కూడా గెలవడమే. ప్రతిదానికీ ఈమధ్య మీ స్టూడెంట్స్ "లైట్ తీసుకో" అంటుంటారు కదా, నిజంగా లైట్ తీసుకోవడం అంటే అది. విచక్షణతో ఆలోచించాలి. కాలేజీలో ఒకరిపై ఒకరికి ఉన్న అభిప్రాయాలు తరువాత మారొచ్చు.

నిజమైన ప్రేమ అన్ని పరీక్షలకీ నిలబడుతుంది. ఎవ్వరినీ బాధించదు. చెయ్యకూడని తప్పులు చెయ్యనివ్వదు. ప్రేమించామని వెంటబడే అబ్బాయిలతో అమ్మాయిలు అప్రమత్తంగా ఉండి, విచక్షణతో మెలగాలి. ప్రేమిస్తున్నానని వచ్చిన వ్యక్తిలో నిజాయితీ ఉండొచ్చు లేకపోవచ్చు, కాలేజీ ప్రేమకు చదువయ్యిందాకా కాలపరీక్ష పెట్టాలన్నదే మా రాణి కాన్సెప్ట్. నిజమైన ప్రేమికులు ఒకరికోసం ఒకరు ఎటూ నిరీక్షిస్తారు. చదువునూ, నిజమైన ప్రేమను కూడా కాపాడుకోవడానికి, ప్రేమ నటించేవారి బారినపడకుండా ఉండటానికి ఇది సరైన ఫార్ములా. అదే మా కాలేజీ కథ ద్వారా మీరు తెలుసుకోవాల్సింది" అన్నది.

కొందరు అమ్మాయిలు చప్పట్లు కొట్టారు. లావణ్యాతోసహా మరికొందరు మాత్రం మౌనంగా చూస్తుండిపోయారు. వాళ్ళను గమనించిన విజయలక్ష్మి వాళ్ళ తలపై చెంపలపై నిమురుతూ "ఆఫ్ట్రాల్ ఇట్ ఈజ్ యువర్ ప్రెషస్ అండ్ స్వీట్ లైఫ్, లెట్ నోబడి స్పాయిల్ ఇట్ ఇన్ ది నేమ్ ఆఫ్ లవ్, గుడ్ నైట్, ఆల్ ఆఫ్ యూ గో టు యువర్ బెడ్స్" అన్నది. పడుకొని ఆలోచిస్తూనే అందరూ చిన్నగా నిద్రలోకి జారిపోయారు.

మరుసటిరోజు ఉదయం అందరినీ ఎక్కించుకొని బోటు పాపికొండలు వైపుగా బయలుదేరింది. లావణ్య తన సెల్‌ఫోన్ అందుకుంది, చైతన్యతో మాట్లాడటానికి... కాన్ఫిడెంట్‌గా. •

ఆరోగ్యం

# సైనసైటిస్‌కు హోమియో వైద్యం

ఆధునిక జీవన విధానంలోని అనేక అపసవ్యతలు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. నగరాల్లో, పట్టణాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం వల్ల చాలామంది తరచు అనేక రకాల రుగ్మతలకు గురవుతున్నారు. సాధారణంగా ఎక్కువమంది ఎలర్జీ వల్ల జలుబుతోనూ సైనసైటిస్‌తో బాధపడుతుంటారు. జలుబు రాగానే ఏవో కొన్ని మందులు వేసుకొన, చిట్కాలు పాటించి కొంచెం ఉపశమనం చేకూరగానే దాని గురించి పట్టించుకోరు. సైనసైటిస్ సమస్య వున్నవారు కూడా ఇదే ధోరణిలో వ్యవహరించడం వల్ల, ఆరోగ్యం పట్ల తగినంత శ్రద్ధలేకపోవడం వల్ల అది దీర్ఘకాలిక రోగంలా సంవత్సరాల తరబడి వుంటోంది. రోజూ వరుసగా తుమ్ములు వచ్చినా, తరచుగా జలుబుతో బాధపడినా సైనసైటిస్ లక్షణాలు మీకు వున్నాయని అర్థం చేసుకోవాలి. కొందరు కొన్నిసార్లు ఆగకుండా తుమ్ముతారు. ఇంకొందరు పదేపదే జలుబుతో బాధపడుతుంటారు. క్రానిక్‌గా జరుగుతున్నప్పుడు తమ ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఇలాంటివారు శీతాకాలంలో, వర్షాకాలంలో మరింత ఎక్కువగా సతమతమవుతారు. కనుక సైనసైటిస్ అని తెలియగానే జాగ్రత్తగా వ్యవహరించాలి. హోమియో వైద్యవిధానంలో దీనికి శాశ్వత నివారణ మందులున్నాయి. హోమియో వైద్యుని సంప్రదిస్తే వ్యాధి ఏ దశలో వున్నదో గ్రహించి మందులు ఇస్తారు. సైనసైటిస్‌కు సంబంధించిన కొన్ని హోమియో మందుల వివరాలివి-

**యూఫ్రేషియా 200:** సైనసైటిస్ కారణంగా ముక్కు దిబ్బడతో బాధపడుతూ, తలనొప్పిగా ఉన్నప్పుడు ఈ మందును ఇవ్వాలి.

**మెర్క్‌సాల్ 200:** ముక్కు లోపల పొక్కులు తయారయి దుర్వాసన వచ్చి నొప్పితో బాధపడే సందర్భంలో ఈ మందును ఇస్తే తగిన ఉపశమనం లభిస్తుంది.

**కాలీబైక్రోమికం 200:** ముక్కు నుంచి నీరుగారుతూ తలనొప్పిగా వుండి ముక్కు పట్టేసినట్టుగా వుంటే ఈ మందును ఇస్తే మంచిది.

**నేట్రంమూర్ 200:** సైనసైటిస్ వున్నవారు భరించలేనంత నొప్పితో తల్లడిల్లుతుంటే, వాపు విపరీతంగా వుంటే ఈ మందును ఉపయోగించుకోవాలి.

**కాలీ అయోడియం 200:** ముక్కు వాపు బాగా పెరిగిపోయి, దుర్వాసనతో కూడిన చీము విపరీతంగా కారుతుంటే ఈ మందును ఇవ్వడం వల్ల తగిన ఫలితం ఉంటుంది.

**స్టనం 200:** సైనసైటిస్‌లో కొందరికి ముక్కువాపు పెరుగుతూ, తగ్గుతూ ఉండే సందర్భాల్లో ఈ మందును ఇవ్వడం ఉపయుక్తంగా ఉంటుంది.

**నక్స్‌వామికా 200:** ముక్కు పైభాగం వాయడం, కణతల నొప్పి తీవ్రంగా వుండి రోగి బాధపడే వేళ ఈ మందు వాడాలి.

**బెల్లడోనా 200:** ముక్కుపుటాలు ఎర్రగా తయారయి, తీవ్రమైన తలనొప్పి ఆకస్మికంగా వచ్చినప్పుడు ఈ మందును ఇవ్వాలి.

ఈ విధంగా హోమియో వైద్యవిధానంలో సైనసైటిస్ నివారణకు వివిధ రకాల మందులున్నాయి. మనిషి శరీరతత్వం, ఆరోగ్య స్థితి, సైనసైటిస్ ఏ దశలో వున్నదీ నిర్ధారించాకనే హోమియో వైద్యులు మందులు ఇస్తారు.

అయితే జబ్బు తీవ్రమైన దశలో కాకుండా ప్రాథమిక దశలోనే వైద్యుల్ని సంప్రదించడం వల్ల తగిన ఫలితాలు లభిస్తాయి. తొలిదశలోనే సంప్రదిస్తే సైనసైటిస్ శాశ్వత నివారణకు తగిన చికిత్స లభిస్తుంది. కనుక సైనసైటిస్‌తో అవస్థపడేవారు ముందుగానే అప్రమత్తులయి వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

– డాక్టర్ దండెపు బస్వానందం